


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 06-08-2022 | VIJAYABHANU DAILY ⋆ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 274 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## రైతుల కు ఎరువులు అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలి

### రైతులకు గరిష్ఠ లబ్ధి చేకూరాలి
### వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెంచుదాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..



**తాడేపల్లి** : రాష్ట్రంలోని రైతులకు గరిష్ఠ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి.. సంబంధిత అధికారు లను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయంపై సమీక్షా సమావేశం నిర్వహించా రాయన. ఈ సందర్భం గా.. రైతుల కు ఎరువులు అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత మంత్రిత్వశాఖను, అధికారులను ఆయన ఆదేశించారు. అంతేకాదు ఎక్కడ నుంచి ఎలాంటి సమాచారం వచ్చినా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్బీకేల్లో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ నుంచి ప్రతి రోజూ నిరంతరం సమాచారం తెప్పించు కోవాలన్న సీఎం జగన్.. విత్తనాల సరఫరా, ఎరువుల పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తులకు అందు తున్న ధరలు తదితర అంశాలపై పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

ఈ-క్రాప్ వందశాతం పూర్తిచేయాలని, వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకంతో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన భాగస్వామ్యం కానుందని తెలిపారు. రైతులకు గరిష్ట లబ్ధి చేకూర్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం జగన్.. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపైనా ప్రధానంగా చర్చించారు. డ్రోన్ల వినియోగంపై మాస్టర్ ట్రైనర్లను తయారు చేయాలన్న ఆయన.. డ్రోన్ల నిర్వహణ, మరమ్మతుపై తరువాయి 2లో..

## ఆర్బీఐ షాక్‌తో ఇక ఈఎంఐలు భారమే !



ముంబై: కేంద్ర బ్యాంకు ఆర్బీఐ తాజా నిర్ణయంతో సామాన్యుడికి భారీ షాక్ ఇచ్చింది. గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలో 50 బీపీఎస్ పాయింట్లు మేర రెపోరేటును నిర్ణయాన్ని ఏకగ్రీవం గా తీసుకున్నారు. దీంతో రెపో రేటు 5.40 శాతాని చేరింది. ఫలితంగా గృహ, వాహనాల రుణాలపై వినియోగదారులకు ఈఎంఐ భారం పడనుంది.

రెపో రేట్ పెరిగితే బ్యాంకులు కస్టమర్లకు ఇచ్చే రుణాల వడ్డీ రేట్లు పెంచకుండా ఉండవు. దీంతో కస్టమర్లకు ఈఎంఐ భారం అవుతుంది. హోమ్ లోన్, పర్సనల్ లోన్, ఇతర రుణాల వడ్డీ రేట్లు పెరుగుతాయి. కొత్తగా రుణాలు తీసుకునేవారికీ ఎక్కువ వడ్డీ రేటు వర్తిస్తుంది. ముఖ్యంగా రెపో రేట్‌కు అనుసంధానమైన హోమ్ లోన్లు తీసుకున్న వారికి తాజా సవరణతో సమస్య తప్పదు. దాదాపు 40 శాతం రుణాల రేట్లు ఇలానే ఉంటాయి. అలాగే ఆ ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూలంగా ఉండనుంది.

## ఎలక్ట్రిక్ వాహన రంగానిదే భవిష్యత్

- ఏపీలో పెట్టుబడులకు పలు కంపెనీల ఆసక్తి
- ప్రజలకు హాని చేయని పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ పెద్దపీట
- ఏపీలో ఈవీ వ్యవస్థ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులను సమకూరుస్తాం
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం వర్చువల్ సదస్సులో పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్





అమరావతి (విజయభాను న్యూస్) : భవిష్యత్ లో ఎలక్ట్రిక్ వాహనరంగానిదే హవా ఉంటుందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ హిత పెట్టుబడులకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఏపీలో ఎలక్ట్రిక్ వాహనరంగ వ్యవస్థ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులను సమకూరుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు ఆధ్వర్యంలో శు క్రవారం వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో జరిగిన వర్చువల్ సదస్సులో మంత్రి అమర్ నాథ్ మాట్లాడుతూ మంచి ఎక్కడున్నా తీసుకుంటామన్నారు. 2050 కల్లా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయంగా పెట్టుబడికి అనువైన రాష్ట్రంగా మారనుం దన్నారు. గ్రీన్ ఎనర్జీతో పాటు ఎలక్ట్రానిక్ వాహనరంగాన్ని ఏపీ ప్రోత్సహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రవాణా అనుసంధానం, పుష్కలంగా సహజ వనరులు, నైపుణ్యం కలిగిన యువతీయువకులు, అపారంగా మౌలిక వసతులు ఏపీలో ఉన్నాయని మంత్రి సదస్సులో ఎలక్ట్రిక్ వాహన రంగ కంపెనీలకు చెందిన సీఈవోలకు వివరించారు. ఏపీలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఈవీరంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని మంత్రి అమర్ నాథ్ ఆహ్వానం పలికారు.

గ్రీన్ ఎనర్జీ లభ్యత, ఇంజనీరింగ్, తరువాయి 2లో..

## వ్యవసాయ పరిశోధనకు బడ్జెట్ ఎందుకు పెంచలేదు?



న్యూఢిల్లీ : వ్యవసాయం పరిశోధనకు బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులను ఎందుకు పెంచడం లేదని వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజ్యసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా వ్యవసాయ మంత్రిని అనుబంధ ప్రశ్న వేస్తూ 2021-22లో సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం వ్యవసాయ పరిశోధనకు 8,514 కోట్ల కేటాయింపులు జరిగాయి. 2022-23 బడ్జెట్‌లో సైతం అంతే మొత్తం కేటాయించారు. వ్యవసాయ పరిశోధనకు ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయించలేదు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల వలన సంభవిస్తున్న అకాల వర్షాల వంటి సమస్యలతో ఏటా పంటలు

నష్టపోతూ రైతాంగం కష్టాలను ఎదుర్కొం టున్న నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడే వంగడాలను అభివృద్ధి చేసేందుకు వ్యవసాయ పరిశోధనపై భారీగా ఖర్చు చేయవలసిన అవసరం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోందో వివరించాలని ఆయన ప్రశ్నించారు.

దీనికి వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాష్ చౌదరి జవాబిస్తూ వ్యవసాయ పరిశోధనను ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోను విస్మరించబోదని చెప్పారు. పరిశోధనకు మరిన్ని నిధులు కావాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి (ఐసీఏఆర్) కోరితే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలో వ్యవసాయోత్పత్తుల పెరుగుదల తోపాటు వ్యవసాయ తరువాయి 2లో..

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

### గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.భరత్ గుప్త



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : లబ్దిదారులకు మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.భరత్ గుప్త సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవాం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తో కలసి నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకం పై హౌసింగ్ అధికారులలో సమావేశం, జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన లబ్దిదారులందరికి నిర్మాణ కార్యక్రమం శత శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఔట్ల వద్ద ఇళ్ల నిర్మాణ సమయంలో ఇసుక, సిమెంట్, స్టీల్, తదితర సామాగ్రి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన తరువాయి4లో..

## శ్రీశైలం ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేత.. పర్యాటకుల సందడి

సున్నిపెంట సర్కిల్: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. జూరాల, సుంకేసుల, హంద్రీ జలాశయాల నుంచి 2,26,361 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 5 గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,39,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 63,083 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు తరువాయి 4లో..




## హృదయం నిండుగా మువ్వన్నెల జెండా

### స్వాతంత్ర్య పోరాటంలో ఏయూ ఆచార్యులు, విద్యార్థులు భాగమయ్యారు
### త్రివర్ణ పతాకంతో ఏయూ విద్యార్థుల భారీ ర్యాలీ

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వ విద్యాలయం విద్యార్థులు ఐదు వందల అడుగుల పొడవైన జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు 1500 మంది విద్యార్థులు ఉత్సాహంగా జాతీయ పతాకాన్ని చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రిన్సిపాల్ కార్యాలయం, ఈసిఈ విభాగం, మెకానికల్, సివిల్, ఆర్కిటెక్చర్ విభాగాల మీదుగా ఏయూ ప్రధాన పరిపాలనా కార్యాలయం వరకు సాగింది. దారిపొడవునా విద్యార్థులు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. హర్ ఘర్ తిరంగా సెలబ్రేషన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయూ పరిపాలనా భవనం వద్ద విద్యార్థులను ఉద్దేశించి వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రసంగించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాలను ఏయూలో ఘనంగా నిర్వహిస్తూ విభిన్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వాతంత్ర్యానికి ముందే ప్రారంభమైన ఆంధ్రవిశ్వవిద్యాలయం తరువాయి4లో..



# విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన

విశాఖపట్నం(విజయభాను న్యూస్): స్థానిక సీతంపేటలోని విద్యాలయ స్కూల్లో విద్యార్థి కమిటీ ఎన్నికలు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. గతేడాది మాదిరే ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు తరగతులవారీ సీపీఎల్, స్కూల్ మొత్తానికి ఎస్ పీ ఎల్ కోసం ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ డైరెక్టర్ గొర్లె శివానంద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన కల్పించేందుకే విద్యార్థి కమిటీ ఎన్నికలు నిర్వహించినట్టు తెలిపారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఎన్నికల నిబంధనలను దాదాపుగా అనుసరిస్తూ, వాటిపై పిల్లలకు అవగాహన కల్పిస్తూ ఈ విద్యార్థి ఎన్నికలను నిర్వహించామన్నారు. గెలుపొందిన ఎస్ పీ ఎల్, సీపీఎల్ లను అభినందించారు. నియామక పత్రాలను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వజ్రకవచ ధారణిలో లక్ష్మీనారాయణుల దర్శనం

*- ఆలయల్లో ప్రత్యేక పూజలు*

*- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు*

*- బారులు దీరిన భక్తులు*



మధురవాడ (విజయభాను న్యూస్) : శ్రావణ శుక్రవారం సందర్భంగా కొమ్మాధి అన్నం రాజు నగర్ లో వేంచేసియున్న అష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం లక్ష్మి నారాయణలను వజ్రకవచ ధారణిలో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులుదీరారు. సుప్రభాత సేవ, అష్టలక్ష్మి హెూమం ఇలా అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సత్యన్నారాయణ మూర్తి రమాదేవి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అలాగే సాయంకాలం పారాయణం, కుంకుమార్చనలు కూడా అమ్మవారికి నిర్వహించామని ప్రధాన అర్చకులు శ్రీధర్ స్వామీజీ తెలిపారు.

## ఫ్రైడే డ్రైడే




మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ జోన్ 2 పరిధి 6వ వార్డు 36 సచివాలయం పరిధిలోనున్న దేవి మెట్ట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటుగా వై.ఎస్ ఆర్.సి.పి భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఇంచార్జ్ కనకరాజు సియ్యాద్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండొచ్చని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గ్రామస్థులకు ఆయన సూచించారు. వ్యాధులుకు కారణమైన దోమలు, వాటి లార్వాలను నిర్మూలించడానికి ప్రజలు సహకరించాలని, ప్రతీ ఫ్రైడే రోజున డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లార్వా దశలోనే దోమలను నివారించడం ద్వారా వాటి ద్వారా వచ్చే వ్యాధులు దరిచేరకుండా చేయవచ్చని, ఇళ్లల్లోనూ మరియు పరిసరాల్లోనూ నీటి నిల్వ లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రెటరీ నారాయణమూర్తి, సానిటరీ సెక్రెటరీ నారాయణరావు, ఏఎన్ఎం రమణమ్మ, వాలంటరీస్ అశ్విని, స్వర్ణలత, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దళితులపై మారణ కాండ జరిగి 31ఏళ్ళైనా దక్కని న్యాయం

### దళిత విముక్తి ఆధ్వర్యంలో నిరసన సభ

### హంతకులను శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల డిమాండ్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : చుండూరు దళితులపై మారణకాండ జరిగి నేటికి 31 ఏళ్లయినా ఇంతవరకు అలాంటి న్యాయమూ జరగలేదని దళిత, ప్రజాసంఘాల నేతలు ధ్వజ మెత్తారు.కుల నిర్మూలనకు ప్రతిఘటన పోరాటంలో అందరూ మమేకం కావాలని పిలుపు నిచ్చారు నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దళిత విముక్తి (ఆంధ్ర ప్రదేశ్)ఆధ్వర్యంలో శుక్రవారం దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన సభను నిర్వహించారు. కుల నిర్మూలన పోరాటంలో మృతి చెందిన దళిత అమరవీరులకు నివాళులర్పించారు.మీ ఆశయాలు సాధిస్తామని నినాదాలు చేశారు .ఈ కార్యక్రమంలో డా.పి. జె.సుధాకర్ మాట్లాడుతూ 1991 ఆగస్టు 6నాటి గుంటూరు జిల్లా చుండూరు మారణ హెూమంలో 8 మంది దళితులను వేటాడి వెంటాడి హతమార్చారని చెప్పారు. ఘటన జరిగిన పదహారేళ్ళకు పాక్షిక న్యాయం ఈ కేసులో జరిగినా తిరిగి 24 ఏళ్ల తర్వాత హైకోర్టు సాక్షాలు లేవని ఈ కేసును కొట్టివేయటం దారుణమన్నారు. ఇప్పటికీ ఇంకా సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకట రమణ మాట్లాడుతూ చుండూరు హంతకులు ఎవరని దళితుల ప్రశ్నకు పాలకులు, పోలీసులు ,న్యాయ వ్యవస్థ నుండి అలాంటి సమాధానం లేదని దుయ్యబట్టారు. వేల సంవత్సరాలుగా దళితులపై అణచివేత, హంతక దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

. 1985లో కారంచేడు లో ఇదే మాదిరిగా ఐదుగురు దళితులను చంపేశారని చెప్పారు. 28 ఏళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే ,ఇప్పటి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దళిత యువకులను శిరో ముండనం చేసిన కేసులో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. పదేళ్ల కిందట శ్రీకాకుళం జిల్లా లచ్చిం పేట దళితుల పై జరిగిన హత్యాకాండ లో శిక్షలు పడలేదని విచారణ లో తీవ్రజాప్యం జరుగుతుందన్నారు. పి వో డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశ్నిస్తున్న వాళ్ళను జైలులో పెట్టే నిరంకుశ పాలన కొనసాగుతుందన్నారు.దేశ సంపద అంబానీ, ఆదానీలకు దోసిపెడుతున్నారని దుయ్యప ట్టారు. ఇటీవల ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్ అయిన దళిత యువకుడ్ని హతమార్చాడని తెలిపారు. కోనసీమకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మారిస్తే సహించలేక విధ్వంసం సృష్టించడం దారుణం అన్నారు .రావులపాలెం దగ్గర గోపాలపురంలో తిని పడేసే టిఫిన్ ప్లేట్లపై అంబేద్కర్ ముఖ చిత్రాన్ని ముద్రించి ,వినియోగించిన వారిని వదిలేసి ఈ దారుణాన్నిప్రశ్నించిన దళిత యువకులపై నాన్ బెయిలబుల్ కేసులు బానాయించి జైలుకు పంపించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి అనేక దాడులు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయని దళితులు స్వీయ గౌరవంతో రాజ్యాంగ నిర్మాత డా.బి. అర్.అంబేడ్కర్ స్ఫూర్తితో వాటిని ప్రశ్నిస్తుంటే ఆధిపత్యం కులోన్మాధులు మారణకాండలతోసమాధానం ఇస్తున్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేయటం, ఆయన్ని అవమాన పరచటం. పదే పదే జరుగుతుందన్నారు. హెచ్. అర్. ఎఫ్ నాయకుడు వి. ఎస్.కృష్ణ మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్న దళితులకు రక్షణ లేదని తెలిపారు. గతంలోకేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్ట సవరణను నిరసించిన 13మంది దళితులను పోలీసులు కాల్చచంపారని మండి పడ్డారు. దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకట రమణ మాట్లాడుతూ మనువాద పాలకులు రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర సాగిస్తున్నారని,రిజర్వేషన్లను తొలగించే ప్రక్రియ మొదలైందని దుయ్య బట్టారు.ఈ కార్యక్రమంలో

బుద్ధిస్తు నటరాజ్, భీమ్ సేన వార్ నాయకులు కె.చిన్నారావు, వి.రాజేంద్ర ప్రసాద్, ఇఫ్టూ నాయకుడు మల్లయ్య, ఎం ఎన్ ఎస్ ఎస్ అధ్యక్షుడు కె.రవి,భానాసా ప్రతినిధి రాంప్రభు,దళిత విముక్తి ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, బి. సన్యాసమ్మ,శివతదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఎలక్ట్రిక్ వాహన రంగానిదే భవిష్యత్

పరిశోధన, అభివృద్ధి, ఎలక్ట్రిక్ వాహన రంగంలో పర్యావరణ వ్యవస్థ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ తయారీ హబ్ గా తీర్చిదిద్దడం, బ్యాటరీ మార్పిడీకి సంబంధించిన కీలక అంశాలను పాలసీలో పొందు పరచడంపై కొన్ని ఈవీ కంపెనీలు చర్చలో భాగంగా సూచనలిచ్చాయి. ఈ సదస్సులో సీ4వీ, ఓలా ఎలక్ట్రిక్, అవేజ్, గోగొరో, అవేరా, బౌన్స్, కాసెస్, టాటా పవర్, రిలయన్స్ న్యూ, షెల్ ఇండియా, ఎప్సిలన్ కార్బన్, కియా ఇండియా, హ్యుందయ్ మోటార్స్, ఈవీ నవ్, హాప్ ఎలక్ట్రిక్, ఫాక్స్ కన్ , జేబీఎం తదితర కంపెనీల సీఈవోలు సదస్సులో పాల్గొన్నారు.

**-ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షల లక్ష్యాన్ని ప్రశంసించిన నీతి ఆయోగ్ సలహాదారు సుదేందు సిన్హా.**

అనుకున్నది ఏదైనా వెంటనే చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందుంటుందని నీతి ఆయోగ్ సలహాదారు సుదేందు సిన్హా ప్రశంసించారు. ఒక ఆలోచన వస్తే వెంటనే ఆచరణలో పెట్టడంలోగానీ, ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళికతో లక్ష్యాన్ని చేరడంలో గానీ ఏపీ తీరు ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మెచ్చుకున్నారు. ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఆంధ్రప్రదేశ్ దారి చూపే స్థాయికి చేరుతుందన్నారు.

**కాలుష్య మరణాలు తగ్గించగలిగితే 5శాతం వృద్ధిరేటు సాధించినట్లే**

ఏపీఈడీబీ సీఈవో, ఏపీఐఐసీ వీసీ & ఎండీ సుబ్రహ్మణ్యం జవ్వాది

గ్రీన్ ఎనర్జీతో కాలుష్యం తగ్గించుకున్నప్పుడే పర్యావరణ హిత పరిశ్రమల స్థాపన సాధ్యమని ఏపీఈడీబీ సీఈవో, ఏపీఐఐసీ వీసీ& ఎండీ సుబ్రహ్మణ్యం జవ్వాది వెల్లడించారు. దేశవ్యాప్తంగా 15 ముఖ్య పట్టణాల్లో 11 పట్టణాలు ఇప్పటికే కాలుష్యంతో నిండిపోయాయన్నారు. గతేడాది ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు విపరీతంగా పెరగడం శుభ పరిణామమని సీఈవో స్పష్టం చేశారు. క్రితం సంవత్సరం 26వేల వాహనాల కొనుగోలు కాస్త 77వేల వాహనాల కొనుగోలు స్థాయికి చేరడం ఈవీ ప్రాముఖ్యతకు నిదర్శనమన్నారు. అయితే, ప్రతి ఏడాది మన దేశంలో పర్యావరణ కాలుష్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య 20 లక్షలు ఉండడం పట్ల అప్రమత్తమవ్వాలని సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి 2 మిలియన్ల మరణాలు తగ్గించగలిగితే 5శాతం వృద్ధిరేటు సాధించినట్లేనని సుబ్రమణ్యం జవ్వాది పేర్కొన్నారు. వాణిజ్యం, ప్రజా రవాణా రంగాలు కలిపి 10 లక్షల విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంతో ముందుకువెళుతుందని పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన గుమ్మళ్ళ వెల్లడించారు. అనుబంధ రంగాలన్నింటినీ ఈవీ పర్యావరణ వ్యవస్థను ఏపీలో తీర్చిదిద్దడానికి ప్రణాళికతో ముందుకెళతామన్నారు. 2030 నాటికి రాష్ట్ర ఇంధన వినియోగంలో గ్రీన్ ఎనర్జీ వాటా 45శాతం లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. గ్రీన్, పునరుత్పాదక శక్తి వైపు మళ్ళేందుకు గల అన్ని మార్గాలను అన్వేషిస్తూ సర్వ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. 2023 కల్లా ఆంధ్రప్రదేశ్ 10.8 గిగా వాట్ల సామర్థ్యం లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం డీజిల్ తో నడుస్తున్న ప్రజా రవాణా వ్యవస్థను 50శాతం విద్యుత్ వాహనాలుగా మలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టీ క్రిష్ణబాబు వెల్లడించారు. మొత్తం ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న 7000 బస్సులలో 1000 బస్సులని విద్యుత్ వాహనాలుగా మార్చే దిశగా ముందుకువెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా ఇప్పటికే తిరుపతి నుంచి తిరుమలకు 100 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి క్రిష్ణబాబు, నీతి ఆయోగ్ సలహాదారు (మౌలిక వసతుల అనుసంధానం, రవాణా, ఎలక్ట్రిక్ మొబిలిటి) జె.సిన్హా, ఏపీఈడీబీ సీఈవో, ఏపీఐఐసీ వీసీ & ఎండీ సుబ్రమణ్యం జవ్వాది, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన గుమ్మాల, వరల్డ్ ఎకనమిక్ ఫోరం, మూవింగ్ ఇండియా ప్రతినిధుల బృందం, ఎలక్ట్రానిక్ మానుఫాక్చరింగ్ కంపెనీల సీఈవోలు,తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కు ఎరువులు అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలి

శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులతో చెప్పారు. అంతేకాదు.

నియోజకవర్గానికి ఒక ఐటీఐ లేదంటే ఒక పాలిటెక్నిక్ కాలేజీలోని విద్యార్థులకు డ్రోన్ల వినియోగం, నిర్వహణ, మరమ్మతులపై సంపూర్ణ శిక్షణ ఇప్పించాలని సూచించారు.

సమీక్షలో.. ఖరీప్ సీజన్ పై సీఎంకు అధికారులు వివరాలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు. ఆగస్టు 3 నాటికి 16.2 శాతం అధిక వర్షపాతం నమోదు. ఈ ఖరీఫ్ సీజన్లో 36.82 లక్షల హెక్టార్ల మేర సాగు విస్తీర్ణం ఉంటుందని అంచనా కాగా, ఇప్పటికే 18.8 లక్షల హెక్టార్లలో పంటలసాగు. ఈ సందర్భంగా రైతులకు అందుతున్న విత్తనాల నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపించాలని సీఎం జగన్, అధికారుల్ని ఆదేశించారు. సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపిన అధికారులు. ఆర్బీకేల ద్వారా వీటిని పంపిణీచేస్తున్నామన్న అధికారులు.

**నూటికి నూరు శాతం ఈ- క్రాప్**

ఈ- క్రాప్ వందశాతం పూర్తిచేయాలి. సెప్టెంబరు మొదటివారంలోగా ఈ- క్రాపింగ్ పూర్తిచేయాలి. ఆర్బీకేల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్, రెవిన్యూ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను పూర్తిచేసేలా చూడాలి. రోజువారీగా ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి. ఈ-క్రాపింగ్ చేసిన తర్వాత భౌతిక రశీదు, డిజిటల్ రశీదు ఇవ్వాలని సీఎం జగన్ తెలిపారు. ఈ-క్రాపింగ్ చేసినప్పుడు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నామని, వెబ్ ల్యాండ్తో కూడా అనుసంధానం చేస్తున్నామని అధికారులు వివరించారు. వెబ్ ల్యాండ్లో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే.. వాటిని వెంటనే సరిదిద్దుకుంటూ పోవాలని సీఎం జగన్ సూచించారు. వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకంతో భాగస్వామ్యం కానున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన. రైతులకు గరిష్ట లబ్ధి చేకూర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆర్బీకేల్లో ప్రతి కియోస్క్ పనిచేసేలా చూడాలన్న సీఎం జగన్.. వాటికి సవ్యంగా ఇంటర్నెట్ కనెక్షన్ ఉందా? లేదా? అన్నదానిపై నిరంతరం పరిశీలన చేయాలని అధికారులకు ఆదేశించారు. వైయస్సార్ యంత్రసేవ కింద రైతులకు మరిన్ని పరికరాలు ఇవ్వాలన్న సీఎం జగన్.. దీనికోసం అన్నిరకాలుగా సిద్ధంకావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.


ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఏపీ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయశాఖ) అంబటి కృష్ణారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, వ్యవసాయశాఖ కమిషనర్ సి హరికిరణ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరిశోధనకు

# బడ్జెట్ ఎందుకు పెంచలేదు?

రంగానికి ద్యుత్ అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ఉత్పాదక పెంచడానికి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు ఆవిష్కరిస్తున్న నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఆచరణలోకి తీసుకువస్తున్నారు. గత కొన్నేళ్ళలో వ్యవసాయ పరిశోధన ద్వారా 1957 కొత్త వంగడాలు, వాతావరణ మార్పులను తట్టుకోగల 286 కొత్త వంగడాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారని మంత్రి వెల్లడించారు.

## స్వర్ణ వస్త్రాలంకరణ లో
# కన్యకా పరమేశ్వరి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వన్ టౌన్ ప్రాంతంలో వున్న కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరుగు తున్న శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శుక్రవారం నాడు అమ్మవారు స్వర్ణవస్త్రా లంకరణ లో భక్తులకు దర్శన మిచ్చారు. ఆల యంలో అమ్మవారి మూల విరాట్ కు తెల్లవారు జామున 5 గంటలకు శుద్ధ జలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ వంటి 108 ద్రవ్యములు మరియు వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, 108 స్వర్ణ పుష్పములతో ప్రత్యేకముగా నివేదన గావించి అమ్మవారిని స్వర్ణ వస్త్రాలంకరణ లో అలం కరణ చేసి భక్తులకు దర్శనం కల్పించినట్లు శ్రావణమాస ఉత్సవ కమిటీ చైర్మన్ పాలూరి వరప్రసాద్ తెలిపారు. దేవాలయ ప్రాంగణం లో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారా యణం చేసిన పిదప దేవస్థాన ఆస్థాన పురో హితులు ఆర్. బి. బి. కుమార్ శర్మ నేతృ త్వంలో సుమారు 250 మంది మహిళల చేత సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వ హించినట్లు దేవాలయ సంఘం కార్యదర్శి, కోశాధికారి శ్రీయుతులు గ్రంధి రామకృష్ణారావు, సుగ్గు శివకుమార్ లు తెలిపారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు, సామూహిక కుంకుమ పూజలు చేసిన మహిళ లకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా అన్ని జాగ్రత్తలు తీసు కున్నట్లు దేవస్థాన సంఘ కోశాధికారి శ్రీ సుగ్గు శివ కుమార్ తెలిపారు.

కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం మహిళా విభాగం సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : జీవీఎంసి. భీమిలీ జోన్ 1వ వార్డ్ సంతపేట అంగన్వాడీ కేంద్రములో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భగా వైకాపా నాయకులు అక్కరమాని రామానాయుడు ఆధ్వర్యంలో సూపర్ వైజర్ కొమ్ము ప్రమీల బాలింతలకు, గర్భిణీలకు తల్లి పాలపై అవగాహన కల్పించారు. తరువాత వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అక్కరమాని రాము నాయుడు చేతులు మీదుగా బాలిం తలకు, గర్భిణీలకు అందచేశారు.

ఈ కార్యక్రమంలో జి.వి రమణ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం పూజలు



యానాం (విజయభాను న్యూస్) : శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తగా పెళ్లయిన నూతన వధూవరులు తొలిసారిగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలను సమర్పించి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ముత్తయిదువులకు వాయినాలు అందించి వ్రతాన్ని పూర్తి చేశారు. స్థానిక అన్యం గార్డెన్స్ లో యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధన్ రావు నివాసంలో వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యానం పరిసర ప్రాంతాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

## చీటీలు పేరుతో
# దేశపాత్రునిపాలెంలో ఘరానా మోసం
### కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న సిఐ పెదిరెడ్ల



పరవాడ (విజయభాను న్యూస్) : జివిఎంసి 79వ వార్డు పరిధిలో గలదేశపాత్రునిపాలెం గ్రామములో నివాసం ఉంటున్న అప్పలబత్తుల కుమారి అను ఆమె వారి గ్రామంలోనే నివాసం ఉంటున్న కసిరెడ్డి ఉమా అను ఆమెకు సుమారు 04 సంవత్స రములు కాలం నుండి వరలక్ష్మి చీటీలు కట్టినారు. అలానే కిందటి సంవత్సరము కూడా పిర్యాది మరియు 60 మంది కలిసి, నెలకు 500 రూపాయలు చొప్పున సంవత్సరము కాలం పాటు సుమారు 3,66,000 లు కట్టినట్టు. అలానే చాలా మంది కసిరెడ్డి ఉమా వద్ద 500 రూ, 1000 రూ, 2000 రూ. లు చీటీలు వేసి నట్టు, వాళ్ళందరికీ సుమారుగా 28,00,000/- లు, చీటి డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసి ఇల్లు ఖాళీ చేసి వెళ్లి పోయి నారు అని పరవాడ పోలీసుస్టేషన్ లో ఎ కుమారి పిర్యాదు చేసారు. దీనిపై పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ చిటీలు భాదితులు అందరూ, వారి దగ్గర ఉన్న ఆధారాలతో పోలీస్ స్టేషన్ కి వచ్చి, వివరాలు తెలియజేయ వల్సినదిగా సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు కోరారు.ఈ సందర్భంగా పరవాడ సిఐ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా గుర్తింపు లేని వ్యక్తులు వద్ద గాని సంస్థలలో గాని చీటీలను కట్టరాదు అని తెలియజేసారు. ఇండ్లు కొనిపెడ తాము అని కొంతమంది ఘరానా మోసగాళ్ళు తిరుగుతున్నారు అని అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దు అని సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు తెలిపారు.

# దేశభక్తి, సామాజిక కార్యక్రమాల్లో ఐ.ఎం.యు. విద్యార్థుల ముందడుగు



ములగాడ (విజయభాను న్యూస్ ): ఆజాదీ కా అమృత మహోత్సవ్, యోగ,హర్ ఘర్ తిరంగా, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో ఐ.ఎం.యు. బి.టెక్ విద్యార్థులు ముందడుగు వేసి తమ దేశభక్తిని, సామాజిక భాధ్యతను చాటుకున్నారు. సబ్బవరం మండలంలోని రాయపుర అగ్రహారంలో వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. వీరికి సామాజిక సేవా కార్యక్రమాల్లో మార్గదర్శకంగా నిలుస్తున్న జాతీయ సేవా పథకం జాతీయ అవార్డు గ్రహీత ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ-... ఐ.ఎం.యు. విశాఖ పట్నం క్యాంపస్ బి.టెక్. విద్యార్థులు చదువుతోపాటు, యువజన వ్యవహారాల్లో, సేవా కార్యక్రమాల్లో వివిధ పోటీల్లో చురుకైన పాత్రను పోషిస్తున్నారని ప్రశంసించారు. ఈ జూన్, జూలై నెలల్లో వారు మొక్కలు నాటడంలో, యోగా ప్రాధాన్యతపై సెమినార్లను నిర్వహిం చడంలో, యోగ పై చిత్రలేఖన పోటీలలో పాల్గొనడంలో విశేష ప్రతిభ చూపించారు. హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించడంలో, గ్రామంలో ఇంటింటికి జెండాలను పంచి జాతీయ జెండా ఆవశ్యకతను వివరించడం, జాతీయోద్యమం పై సెమినార్లను నిర్వహించడంలో చురుకైన పాత్రను పోషించారు. రాయపుర అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండాపై చిత్రలేఖన పోటీలను బాలలకు నిర్వహించి, వారికి జాతీయ నాయకులను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిని క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కేశవ దేవ్, విభాగాధిపతి డాక్టర్ శ్రీజ మరియు అధ్యాపకులు అభినందించారు.

## డ్రంక్&డ్రైవ్ లో పట్టుబడ్డ 18 మందికి
## రూ. 1000 జరిమానా

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : విశాఖ సిటీ పోలీస్ కమీషనర్ సి.హెచ్ శ్రీకాంత్ ఆదేశాలు మేరకు భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్&డ్రైవ్ లో పట్టుబడిన18 మంది కి,15వ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ భీమిలీ మెజిస్ట్రేట్ పి.నాగేశ్వరరావు రూ.1000 జరిమానా, 3రోజులు జైలు శిక్ష విధించినట్లు భీమిలి ట్రాఫిక్ సి.ఐ టి.వి విజయ్ కుమార్ తెలిపారు. ఒకవేళ రూ. 1000 కట్టలేక పోయినట్లయితే అదనంగా మరో మూడు రోజులు జైలు శిక్ష విదిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కోర్ట్ ఆదేశాలు మేరకు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వ హించి ట్రాఫిక్ ఎస్.ఐ, సిబ్బంది తో పర్యవేక్షణలో విశాఖ,సెంట్రల్ జైలుకు వారిని రిమాండ్ నిమిత్తం పంపినట్లు చెప్పారు.ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపవద్దనీ, నడిపితే ఈ శిక్షలు తప్పవని హెచ్చరించారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో
## మొక్కలు నాటే కార్యక్రమం

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భీమిలి శాఖ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ (ఎస్.ఎఫ్.డి) ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం, గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మొక్కలు నాటే కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ ఎస్.ఎఫ్.డి కన్వీనర్ లొడగల అచ్చిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కూడా ఎబి విపి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వ హిస్తుంది అని చెప్పారు. నేల తల్లి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చు కోలేము. కనీసం ఒక్క చిన్న మొక్కని నాటి నేలమ్మ ఆయుష్ ను కాపాడి కొంచెం అయినా రుణం తీరుచు కుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ అప్పారావు, బుత్తల గురునాయుడు, బుత్తల వంశీ, చందు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద స్థాయికి చేరుకున్న
## రైవాడ నీటిమట్టం



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని రైవాడ జలాశయం నీటి మట్టం రోజురోజుకు పెరుగుతుంది. జలాశయం అత్యధిక నీటి మట్టం 114 మీటర్లు కాగా శుక్రవారం సాయంత్రానికి 113.15 మీటర్లు కు చేరింది. గత నాలుగు రోజులుగా చెదురుమదురు వర్షాలు కురవడంతో వరద నీటితో జలాశయం కళకళలా డుతుంది. గత నెల 31న ఖరీఫ్ సీజన్ కోసం ఆయకట్టు భూములకు కుడి, ఎడమ కాలువల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన విషయం విధితమే. శుక్రవారం సాయంత్రం దేవరాపల్లిలో భారీ వర్షం కురిసింది.113.30 మీటర్లు కు నీటిమట్టం పెరిగిన వెంటనే వరద నీటిని లోతట్టు ప్రాంతానికి విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు జలాశయం సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి 1500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని అధికారులు తెలిపారు.

### విశాఖ లో మొదలైన
### కొత్త టీవీఎస్ ఐక్యూబ్
## ఎలక్ట్రిక్ స్కూటర్ల డెలివరీ

విశాఖపట్నం : విశాఖ లో కొత్త టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల డెలివరీ సేవలను ప్రారంభించారు. కేవలం ఒకే ఒక్క రోజులో 100 స్కూటర్లను వినియోగదారులకు టీవీఎస్ అందించింది. గ్రాండ్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులకు టీవీఎస్ ఐక్యూబ్ టీవీఎస్ ఐక్యూబ్ ఎస్ ఎలక్ట్రిక్ స్కూటర్లను అందించారు.

టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ సిరీస్‌లో ప్రస్తుతం మూడు వేరియంట్స్ అందుబాటులో ఉన్నాయి. టీవీఎస్ ఐక్యూబ్, టీవీఎస్ ఐక్యూబ్ ఎస్, టీవీఎస్ ఐక్యూబ్ ఎస్‌టి వెహికల్స్ 11 రంగుల్లో, 3 ఛార్జింగ్ పాయింట్స్‌తో అందుబాటులో ఉన్నాయి.

# ప్రతి ఇంటిపై
# త్రివర్ణ పతాకం రెప రెప లాడాలి



గాజువాక (విజయభాను న్యూస్ ): హర్ ఘర్ తిరంగలో భాగంగా దేశ ప్రజలు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ఆధ్వర్యంలో వార్డులోని 5 సచివాలయాల పరి ధిలో జెండాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు వీటి పంపిణీ కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా జరుగుతున్న ఈ వేడుకలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డి రమణ,సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు పంచాయతీలలో
# సమగ్ర భూ సర్వే ప్రారంభం



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : మండలంలోని ఎం.అలమండ, ఏ.కొత్తపల్లి, పంచాయితీలలో గల రెవిన్యూ గ్రామాలలో సమగ్ర భూ సర్వే డ్రోన్ సర్వే పనులు శుక్రవారం ఆ గ్రామ పంచాయితీల వైస్ ఎంపీపీ చింత బుల్లిలక్ష్మి , ఎం.అలమండ సర్పంచ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ దాడి జగన్నాథరావు (జగన్), ఆయా పంచాయతీలలో సమగ్ర భూ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సమగ్ర భూ సర్వే తో చాలావరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు ఈ సర్వే వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో మండల సర్వేరు ఎం.గోవిందరాజు, ఏ కొత్తపల్లి ఉప సర్పంచ్ పండురి సరువు నాయుడు, ఆయా రెవెన్యూ గ్రామాల వీఆర్వోలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న
## బ్రాండిక్స్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి



అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : మహిళ కార్మికుల ప్రాణాలతో చెలగాట మాడుతున్న బ్రాండిక్స్ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని, ప్రభుత్వం ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము డిమాండ్ చేశారు . శుక్రవారం అచ్యుతాపురంలో గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. రాము మాట్లాడుతూ సెజ్ లో గల బ్రాండిక్స్ ఆపెరల్ పార్కులో సీడ్స్ కంపెనీలో విసవాయువులు లీకై వందలాది మంది మహిళా కార్మికులు ఆసుపత్రులు పాలయ్యారు . రెండు నెలలు గడవక ముందే ఇదే కంపెనీలో రెండవసారి ప్రమాదం జరగడం యాజమాన్యం, ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యమే కంపెనీలో భద్రత ప్రమాణాలు డొల్లతనం మరోసారి బట్టబైలు అయిం దన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా రిపోర్టులు బహిర్గతం చేసి బాధ్యుల పై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు . బ్రాండిక్స్ కంపెనీలో మహిళా కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇచ్చి యాజమాన్యం వెట్టి చాకిరి చేయించు కుంటుందని, కట్టు బానిసల్లా కార్మికులతో పని చేయించుకొని కోట్లాది రూపాయలు లాభాలు పొందుతూ కనీస భద్రత ప్రమా ణాలు పాటించడం లేదని ఆరోపించారు . కార్మికులకు భద్రత పరికరాలు సైతం ఇవ్వడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి వరుస ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కార్మికులు , ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు మండల కమిటీగా హెచ్చరిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు, పి రాజు, రమణ అప్పారావు, కే శ్రీ రామ్, లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ప్లాస్టిక్ జీవితం

'హరిత వస్త్రాన్ని ధరించి శోభిల్లుచున్న నా పుడమి తల్లిపై నానా/రూప సహితమై కళావిహీనంగా మార్చుచున్నది/ హిమాద్రి మొదలు కుమారి వరకూ వనమూలికా సహిత/ ఆరోగ్యకారక జలధారలను చాప క్రింద నీరు వలే ప్రవేశించి తన దురాక్రమణతో/ కలుషితం చేయుచున్నది... ప్లాస్టిక్ భూతం' అంటాడో కవి. ప్రపంచవ్యాప్తంగా మానవాళి నిత్యజీవితంలో భాగంగా మారిన ప్లాస్టిక్... పర్యావరణానికి పెను సవాలుగా మారింది. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వ్యర్థాలు కొండలా పేరుకు పోతున్నాయి. మనం నిత్యం పడేసే వ్యర్థాల్లో ప్లాస్టిక్ వాటా 10 శాతం. ప్లాస్టిక్ మోజులో పడి మానవాళి నష్టపోతోంది. దేశంలో ప్రతి రోజూ 25 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం... భారత్‌లో ఏటా 56 లక్షల టన్నుల చెత్త పోగు పడుతోంది. గత పదేళ్లలో మనం ఉత్పత్తి చేసిన ప్లాస్టిక్ గత శతాబ్దమంతా వాడిన దానికంటే ఎక్కువ. ఇలా వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు నాశనం కాకుండా నిల్వ ఉండి, కాలుష్యానికి కారణమౌతున్నాయి.

ప్లాస్టిక్ ఓ అద్భుతమైన రసాయన సమ్మిళిత పదార్థం. దీంతో అనేక వస్తువులు తయారు చేయవచ్చు. ఇవి అందంగాను, రంగురంగులతో వుండి అత్యంత చౌకగా వుండటంతో ప్లాస్టిక్ ప్రపంచ వ్యాప్తంగా బాగా ప్రచారంలోకి వచ్చింది. 'ధనస్వామ్యపు విలువలకు, దారిద్ర్యపు బతుకులకు- నాగుపాములా వెంట పడుతుంది, అధికారం, ధనం గవ్వలకు దాసోహమై, ప్లాస్టిక్ భూతం ప్రేమ పరుగులు తీస్తుంది' అంటూ నేడు ప్రపంచమంతా ప్లాస్టిక్ మాయలో పడిపోయిందని చెబుతాడో కవి. దీని వ్యర్థాల వల్ల మానవాళికి కలిగే ముప్పు అంతా ఇంతా కాదు. బెంగాల్‌కు చెందిన హీరా షేక్ అనే మహిళ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. అది క్రమేపీ పెరుగుతూ తీవ్రం కావడంతో స్థానిక ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లు ఆ మహిళకు స్కానింగ్ చేయగా, రిపోర్ట్స్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆమె పొట్టలో నుంచి 100 గ్రాముల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇదొక తాజా ఉదాహరణ మాత్రమే. సముద్రాల్లోని జలచరాలు ప్లాస్టిక్ తినడం ద్వారా అసంఖ్యాకంగా చని పోతున్నాయి. పెంపుడు జంతువులను సైతం ప్లాస్టిక్ భూతం వదల్లేదు. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం పాస్టిక్ ఉత్పత్తులు ఒకసారి వాడి పారేయదగ్గవే. ఈ తరహా ప్లాస్టిక్ పర్యావరణానికి హాని కారకమవుతోంది. వీటిని నిషేధించకపోతే 2050 నాటికి భూగోళంపై జీవజాతులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఐక్యరాజ్యసమితి అయిదేళ్లుగా హెచ్చరిస్తోంది. ఇప్పటికే కెన్యా ఇలాంటి ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. థాయ్ లాండ్, రువాండా తదితర దేశాలు అదే బాటన సాగుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను జులై 1 నుంచి భారత ప్రభుత్వం నిషేధించింది.

శాసనాలు, ప్రకటనలతో మాత్రమే మార్పు రాదు. వీటిని అమలు చేయాలంటే సవివరమైన, వాస్తవికమైన, ఆచరించదగిన ప్రణాళికలు కావాలి. 2022 కల్లా ప్లాస్టిక్ వాడకాన్ని అంతమొందిస్తామని ప్రధానమంత్రి మోడీ 2018లో ప్రకటించారు. ఈ ప్రకటన నాటకీయమైనదే తప్ప లక్ష్య సాధనకు ఆలోచించి చేసింది కాదని తేటతెల్లం అవుతోంది. ప్రకటనలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ముందుగా హానికరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులను పరిశ్రమల వద్దే నిలువరించాలి. అలా కాకుండా విచ్చలవిడిగా ప్రజల మీదికి వదిలేసి... మీరు వాడ కండని చెప్పటం సమంజసం కాదు. అదే సమయంలో ప్రజలు కూడా ఈ ప్లాస్టిక్ జీవితం నుంచి బయట పడేందుకు పూనిక తీసుకోవాలి. 250 గ్రాములుండే సెల్‌ఫోన్‌ను జేబులో పెట్టుకు మోస్తున్నాం. సుమారు 30 గ్రాముల లోపే వుండే గుడ్డ సంచిని ఎందుకు మోయలేకపోతున్నాం. ఇంటి నుంచే పేపర్ సంచి గాని, గుడ్డ సంచి గాని, జనపనార సంచి గాని తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ గ్లాసులకు బదులు స్టీలు, గాజు గ్లాసులు, ప్లాస్టిక్ విస్తర్లకు బదులు ఆకులతో చేసిన విస్తర్లు, ఫ్లెక్సీలకు బదులు గుడ్డతో చేసిన బ్యానర్లను వాడొచ్చు. పాఠశాల నుంచి ప్రధాని వరకు ప్లాస్టిక్ లేని జీవితం కోసం కృషి చేయాలి. అప్పుడే భూగోళాన్ని పర్యావరణ హితంగా మార్చగల్గుతాం. ప్లాస్టిక్ లేని భూమిని తయారు చేసుకుందాం. రేపటి తరాల భవిష్యత్తుకు బాటలు వేద్దాం. ప్లాస్టిక్ సంచులకు 'నో' చెబుదాం.

# సి.డి.ఎం.ఎ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జివిఎంసి కమిషనర్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం సి.డి.ఎం.ఎ. ప్రవీణ్ కుమార్ తో రెగ్యులర్ గా జరిగే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. స్థల సర్వే, స్థల గుర్తింపుపై యుపిహెచ్ఎస్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ వారి సూచనలపై హరిత నగరాలు స్మార్ట్ వీధులపై మరియు యూజర్ చార్జీలపై మొదలగు అంశాలపై అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో కమిషనర్ "క్లాప్" పథకంలో భాగంగా రూట్ మ్యాపు ఆధారంగా వ్యర్థాలు తొలగింపు జరుగుతున్నాయని, యూజర్ చార్జీలు వసూళ్లను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని, గ్రీన్ సిటీ ట్రెబ్యుఓనల్ హెచ్చరించిన సూచనలపై ప్రజలకు వివిధ స్వచ్ఛంద సంస్థలకి అవగాహన కల్పించడం జరుగుతుందని, యుపిహెచ్ ల పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని, వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సి.డి.ఎం.ఎ. కి కమిషనర్ వివరించారు. సి.డి.ఎం.ఎ. వారు తెలిపిన సూచనలు, సలహాలు మేరకు అన్ని పనులు సకాలంలో నిర్వర్తించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# ఏయూను సందర్శించిన నావికాదళ అధికారులు

## - ఏయూతో కలసి పనిచేసే దిశగా చర్చలు



ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని షిప్‌బిల్డింగ్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రేర్‌ఆడ్మిరల్ విజయ్ శేఖర్‌తో కూడిన అధికారుల బృందం శుక్రవారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ జియాలజీ, ఫైన్ ఆర్ట్స్, ఇంజనీరింగ్ విభాగాలలో సంయుక్తంగా పనిచేసే దిశగా చర్చించారు. త్వరలో దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. అదే విధంగా షిప్ బిల్డింగ్ సెంటర్‌లో పనిచేస్తూ డాక్టరేట్ కలిగిన వారికి రీసెర్చ్ గైడ్‌గా అవకాశం కల్పించాలని కోరారు. దీనికి ఏయూ వీసీ ప్రసాద రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలో ఏయూ అధికారుల బృందాన్ని ఎస్‌బిసిని సందర్శించాలని ఆహ్వానించారు.విద్యార్థులకు స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలకు తాము అవకాశం కల్పిస్తామన్నారు. విభిన్న అంశాలలో తమకు ఏయూ సహకారం అవసరమన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణకు పనిచేసే త్రివిధ దళాలకు సంపూర్ణ సహకారం, తోడ్పాటును అందించడానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ప్రతీ విద్యార్థిని ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. విద్యార్థులకు నిర్ణీత కాలానికి ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ సేవలను సైతం వినియోగించుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్, జియాలజీ, జియో ఇంజనీరింగ్, ఫైన్ ఆర్ట్స్ విభాగాలతో కలసి పనిచేసే విధంగా త్వరలోఎంఓయూ చేసుకుందామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, షిప్ బిల్డింగ్ సెంటర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లు నిర్మాణాలు వేగవంతం చేయాలి

చోట గోడౌన్లు ఏర్పాటు చేసుకొని సామగ్రిని భద్రపరుచుకోవాలన్నారు. జగనన్నసంపూర్ణ గృహ హక్కు పథకం క్రింద జిల్లాలో మంజూరు అయిన ఇళ్ల పట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన గృహాలు ఆన్ లైన్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం ద్వారా జిల్లా పురోగతిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ అమలు గురించి సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పి.డి. శ్రీనివాస్, జోనల్ కమినర్లు, డి.ఇ.లు, ఎ.ఇలు, తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

# దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

# హృదయం నిండుగా మువ్వన్నెల జెండా

ఘనమైన చరిత్రను కలిగి ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాలుపంచుకోవడం జరిగిందన్నారు. స్వేచ్ఛతో పాటు బాధ్యతను సైతం యువత తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన విధంగా విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.


కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, డీన్‌లు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, టి.షారోన్ రాజు, ఎన్.ఎం యుగంధర్, సి.హెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, డాక్టర్ పల్లవి, సిఎస్ఓ మహ్మద్ ఖాన్, కల్నల్ దాస్,మిస్ సౌత్ ఇండియాగా ఎంపికైన ఏయూ విద్యార్థిని ఛరిష్మా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఏయూ క్రీడా విభాగం, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

# శ్రీశైలం ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేత.. పర్యాటకుల సందడి

విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయానికి 884.70 అడుగులకు నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీంఎంసీలు కాగా.. ప్రస్తుతం 213.88 టీఎంసీలు నీరు ప్రాజెక్టులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం 5గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరవళ్ల చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు.

# వైకాపా ఎమ్మెల్యేలను కాలర్ పట్టుకుని ప్రశ్నిస్తున్నారు

## తెదేపా అధినేత చంద్రబాబు



**అమరావతి** : పాలనను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టాలనుకుంటే రాష్ట్రంలోని 5 కోట్లమంది పైనా పెట్టాలని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. సంక్షేమ పథకాల్లో కోతలు, అభివృద్ధి పనులపై ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలతో వైకాపా ప్రభుత్వం అసహనానికి లోనవుతోందని చెప్పారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు పరిధిలోని వేపనపల్లి 'విద్యాదీవెన'పై ఎమ్మెల్యేను ప్రశ్నించిన ఇంజినీరింగ్ విద్యార్థి జశ్వంత్‌పై కేసు పెట్టి అరెస్ట్ చేయడం ప్రభుత్వ అసహనానికి ప్రత్యక్ష సాక్ష్యమని ఆక్షేపించారు. ఈ మేరకు చంద్రబాబు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపైనా కేసులు పెట్టి వారి జీవితాలను నాశనం చేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా పాలనపై గడపగడపలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవు తోందన్నారు. కాలర్ ఎగరేసుకుని తిరుగుదామనుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలను.. కాలర్ పట్టుకుని జనం ప్రశ్నిస్తున్నారని చెప్పారు. వేపనపల్లిలో జరిగిన ఘటనపై వైకాపా క్షమాపణ చెప్పాలని.. జశ్వంత్‌తో పాటు అతడికి మద్దతుగా నిలిచిన గ్రామస్థులు, తెదేపా నేతలపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసుల అత్యుత్సాహంపై డీజీపీ చర్యలు తీసుకోవాలన్నారు.

# అదే సుబ్రహ్మణ్యస్వామి మహిమ!

## సంకీర్తన



భక్తుల కోరికలను నెరవేర్చడం కోసం సుబ్రహ్మణ్య స్వామి వివిధ ప్రదేశాల్లో అవతరించాడు. అలాంటి విశిష్టమైన క్షేత్రాల్లో ఒకటి అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం 'కోటంక' గ్రామంలో దర్శనమిస్తుంది. ఇక్కడి సుబ్రహ్మణ్య స్వామి మహిమాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడనీ .. పూర్వం స్వామి సర్ప రూపంలో మహర్షులకు దర్శనమిస్తూ వుండేవాడని చెబుతుంటారు.

ఇక్కడ స్వామివారి సన్నిధిలో పాతాళగంగ వుంది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఇందులోని నీటి ధార తగ్గకపోవడం విశేషంగా చెప్పుకుంటూ వుంటారు. ఇది స్వామివారి మహిమగా విశ్వసిస్తూ వుంటారు. ఈ నీటిని స్వామివారి అభిషేకానికి ఉపయోగిస్తారు. పాతాళ గంగలోని నీటిని తీర్థంగా స్వీకరించడానికి భక్తులు మరింత ఆసక్తిని చూపుతారు.

ఈ నీటిని తీర్థంగా స్వీకరించడం వలన, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుముఖం పడతాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు. వివాహం విషయంలోను .. సంతాన భాగ్యం విషయంలోను ఆలస్యమవుతున్నప్పుడు, ఈ స్వామిని దర్శించుకుని మనసులో మాట చెప్పుకుంటే ఆ కోరిక నెరవేరుతుందని అంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడం వలన సమస్త దోషాలు తొలగిపోతాయనీ, పుణ్యఫలాలు చేకూరతాయని చెబుతారు. విశేషమైన పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. ఆహ్లాదకరమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది.

# శివలింగారాధన ఫలితం!

పరమశివుడు లింగరూపంలో ఆవిర్భవించి, భక్తులచే పూజాభిషేకాలు అందుకుంటున్నాడు. శివలింగారాధన వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బంగారం .. వెండి వంటి లోహపదార్థాలతో తయారు చేయబడిన శివలింగాలను, బాణలింగం .. స్పటిక లింగం వంటి వాటితో రూపొందించబడిన శివలింగాలను పూజించడంవలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని చెప్పబడుతోంది. మట్టితోను .. వెన్నతోను .. పిండితోను ఇలా వివిధ రకాల పదార్థాలతో తయారుచేయబడిన శివ లింగాలను ఆరాధించడం వలన, పుణ్య రాశి పెరుగుతుంది. మనసులోని కోరిక లను బట్టి ఆయా శివలింగ రూపా లను పూజించవలసి వుంటుంది. సాధా రణంగా చాలామంది ఆరోగ్యాన్ని .. ఐశ్వ ర్యాన్ని కోరుకోవడం జరుగుతూ వుంటుంది.



ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఐశ్వర్యం .. ఆరోగ్యం రెండూ అవసరమే. అందువలన వాటిని కోరుకోవడం జరుగుతూ వుంటుంది.'పటిక బెల్లం'తో తయారు చేయబడిన శివలింగాన్ని పూజించడం వలన, ఆరోగ్యం కలుగుతుందని చెప్పబడుతోంది. ఇక ఐశ్వర్యాన్ని కోరుకునేవారు 'కపిల గోవు' పేడతో చేసిన శివలింగాన్ని ఆరాధించవలసి ఉంటుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ శివలింగాలను పూజించడం వలన, ఆశించిన ఫలితం తప్పక లభిస్తుందని స్పష్టం చేయబడుతోంది.

# వంగపండుకి టీవీ టూరిజం దర్శకుడు
## మణి భూషణ్ ఘన నివాళి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : గరానికి చెందిన టీవీ టూరిజం సంస్థ ఫౌండర్ మరియు ప్రముఖ దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత మణి భూషణ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సృజనాత్మకత మరియు సాంస్కృతిక సంస్థ చైర్ పర్సన్ వంగపండు ఉష అద్వర్యం లో నిర్వహించిన ప్రముఖ జానపద వాగ్గేయ్య కారులు వంగపండు ప్రసాద్ రెండవ వర్ధంతి సభలో ఎంతోమంది ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పీపుల్స్ స్టార్ దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రజా గాయకులూ, వాగ్గేయకారులు, ప్రతి ఒక్కరి మనస్సులు ఎప్పటికి చిరం జీవులుగా ఉండిపోతారని, వంగపండు రచనలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాయాని, ఎన్నో విప్లవ పాటలతో, ఆడి పాడి ప్రతి ఒక్క మనస్సును రంజిపచేసిన మహానుభావుడని, వారి విగ్రహం ఆవిష్కరణ హృద యాన్ని ద్రవిపంచేసిందని. మహానుభావులు ఎప్ప టికి చిరస్థాయిగా మానవ హృదయాల్లో గూడు కట్టుకుంటారని, వారి రచనలు ఎప్పటికి క్రొత్తదనం తో కార్మిక గుండెల్లో ఆరని జ్యోతిలా వెలుగులు నింపుతాయని, ఎన్ని యుగాలైనా ఉత్తరాంధ్ర ప్రజలకు అయన స్ఫూర్తి ప్రదాత అని, అయన రచనలు అమ్మకానికి కాకా నమ్మకానికి వినియోగించి చిరంజీవి అయ్యారని. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్బంగా దర్శకుడు మణి భూషణ్ ఆర్ నారాయణ మూర్తి కి విశాఖ పర్యాటక సమాచార పుస్తకాలను అందించి, వంగపండు తో ఉన్న అనుబంధాన్ని తెలియపరుస్తూ నిరాడంబరత, ఆప్యాయత, ఆదరణ, అణుకువ, గౌరవం, నిస్వార్ధం, అపారమైన సాహితి అనుభవం, భూమి బాగోతం, ఎరువుల బాగోతం , ఏమి పిల్లో వెళ్దాం వస్తావా ...అనే చిలిపి విప్లవం, అన్నిటికి రూపం వంగపండు అని వారి రెండవ వర్ధంతి సందర్బంగా వారిని స్మరిస్తూ ఘన నివాళి అర్పించారు.ఈ కార్యక్రమం లో టీవీ టూరిజం సీఈఓ సీత రామ స్వామి, ఎడిటర్ నీరజభూషణ్, హీరో నిర్మాత ఆదిత్యభూషణ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం



సబ్బవరం (విజయభాను న్యూస్) : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఎస్. సి ఏబీసీడీ వర్గీకరణ కు చట్ట బద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎం ఆర్ పి ఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీ నుండి 12 వరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాలుగో రోజుకొనసాగుతున్న ఈ దీక్ష శిబిరానికి పెందుర్తి నియోజకవర్గ ఎం ఆర్ పి ఎస్ ఇంచార్జి గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో సబ్బవరం మండల ఎం ఆర్ పి ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎస్. సి వర్గీకరణ కు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు దువ్వ దుర్గాలు, నీటిపల్లి ముత్యాలు, కడితి సాధురావు, కొట్ర కన్నారావు, తోత్తరమూడి శ్రీనివాస్,చెంగల చిన్నారావు,పెట్లి వెంకటరమణ, దేవుపల్లి సంపూర్ణం, రెల్లి కుల సంఘం నాయకులు ఆకుల ఆనందరావు బృందం తదితరులు పాల్గొన్నారు.

# అరకు నియోజకవర్గం సమస్యలపై కలెక్టర్ కి వినతిపత్రం

**ఇంజేరి పంచాయితీలో చనిపోయిన పశువుల కుటుంబానికి పశువులు ఇస్తామని కలెక్టర్ హామీ**

**జామగూడ, బూసుపుట్టు, ఇంజేరి పంచాయితీ సమస్యలు పరిష్కరించండి - మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్**





అల్లూరి సీతారామరాజు జిల్లా.విజయభాను. పాడేరు జిల్లా కేంద్రంలో టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ టీడీపీ నాయకులతో కలిసి అరకు నియోజకవర్గంలో గల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ అరకు నియోజకవర్గం పెదబయలు మండలం ఇంజేరీ పంచాయితి జమదంగి గ్రామాలలో గత మూడు రోజుల క్రితం పడిన వర్షానికి పిడుగుపాటుకు చనిపోయిన పశువులకు నష్టపరిహారం ఇవ్వాలని అదే విధంగా పశువుల కాపరి వంతాల సన్ని మరణించడం జరిగిందని సన్ని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్ధికంగా ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది అదే విధంగా పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది భర్తీ చేయాలని సరిపడ మందులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని బూసుపుట్టు పంచాయితీలో సంత షెడ్డు ఏర్పాటు చేయాలని బూసుపుట్టు పంచాయితీలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు అదే విధంగా గుంజివాడ జామిగుడ వంతెనను వెంటనే నిర్మాణం చేపట్టాలని గత తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు శాంక్షన్ ఇచ్చిన ఇంజరీ లండుల గెడ్డపై వంతెనలు, డుంబ్రిగూడ మండలం కుకుడబెడ్డ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కించుమండ పరిశీల మరియు గసభ లోగిలి వెళ్ళే వంతెన నిర్మాణం చేపట్టాలని అదే విధంగా అనంతగిరి మండలలో పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పెదబయలు మండలం పెదాకొడ పల్లి పంచాయితీలో ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఇచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పెదబయలు మండల టీడీపీ సీనియర్ నాయకులు తైసభు త్రినాథ్, అరకు పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షుడు కూడ భూషణం రావు,దారెల సర్పంచ్ పాండురంగ స్వామి,అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారంజి ప్రసాద్,లక్ష్మిపేట పంచాయితి వైస్ ప్రెసిడెంట్ మర్రిచెట్టు అప్పలనాయుడు, టీడిపి సీనియర్ నాయకులు బత్తిరి రామరావు,గోపి,కోటి, మూర్తి,ప్రసాద్, మాధవ రావు తదతరులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే విద్యార్థులకు ఇక్కట్లు

కాత్రేనికోన : కాత్రేనికోన మండలం ప్రముఖ గేటు సెంటర్ పరిధి అయినటువంటి బ్రాహ్మణ చెరువు గట్టు లో ఉన్నటువంటి పాఠశాల విద్యార్థులు అకాల వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు .వర్షం వస్తే స్కూల్ కి వెళ్లే సిసి రోడ్డు నీట మునిగి విద్యార్థులు రోడ్డు గుండా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది .ముఖ్యంగా బ్రాహ్మణ చెరువు గట్టు వద్ద ఉన్నటువంటి పాఠశాల కు వెళ్లే సిసి రోడ్డు పల్లపు ప్రాంతంలో ఉన్న కారణంగా చుట్టుపక్కల ఉన్నటువంటి వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చి చేరి చెరువును తలపిస్తుంది దీని కారణంగా విద్యార్థులు స్కూలుకి వెళ్లాలంటే నీటిలోంచి నడుచుకుంటూ ఇబ్బంది పడుతూ వెళ్లే పరిస్థితి ఏర్పడింది .నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి గురించి అధిక ప్రచారం ఉన్నప్పటికీ బ్రహ్మన్న చెరువు గట్టు లో ఉన్నటువంటి పాఠశాల పరిస్థితి ఈ విధంగా ఉండటం ప్రభుత్వ కార్యకలాపాలకి వ్యతిరేకమని చెప్పాలి .ప్రభుత్వం ఒకపక్క విద్యార్థుల గురించి శ్రద్ధ తీసుకుంటుంది అని పాఠశాలలు అభివృద్ధి చేస్తుంది అని ప్రసారం చేసినప్పటికీ కాత్రేనికోన మండలం బ్రాహ్మణ చెరువుగట్టు వద్ద ఉన్నటువంటి పాఠశాల కు ఈ విధమైన పరిస్థితి నెలకొంది దీనిపై ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తప్పిన ఘోర ప్రమాదం?



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ (విజయభాను న్యూస్) మండలం లోని కొత్త బళ్ళ గూడా పంచాయతీ ప్రధాన రహదారి కొత్త బలుగుడ ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో గల మలుపు వద్ద విశాఖపట్నం నుంచి అరకు జి పి సి ఎం ఎస్ సొసైటీ ఉచిత బియ్యాన్ని తిసుకొస్తున్న లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రజా పంపిణీ బియ్యాన్ని అరకు జిసిసి గొడన్ కు తరలిస్తున్న ఉచిత బియ్యం గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మలుపు వద్ద అదుపు తప్పడంతో లారీ బోల్తాపడినట్లు తెలిపారు సంఘటన తెలుసుకున్న అరకులోయ మండల తాసిల్దార్ అలాగే సొసైటీ సూపర్డెంట్లు టాహుటిన సంఘటన స్థలంలో కి చేరుకొని జిసిసి లారీ వద్ద బియ్యం బస్తాలను ఎమ్మెల్యేస్ పాయింట్ కు తరలించారు. ఈ ఘటనలో డ్రైవర్ కు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడినట్లు లారీ డ్రైవర్ అన్నారు.

# అవంతి కళాశాలలో జాబ్ మేళా




భీమునిపట్నం, విజయభాను న్యూస్ : తగరపువలస అవంతి గ్రూఫ్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్,ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తగరపువలస అవంతి ఇంజ నీరింగ్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా భీమిలి శాసనసభ్యులు, అవంతి విద్యా సంస్థలు చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అన్నేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసిందనీ, ఎ.పి లో నిరుద్యోగులు ఉండకూడదనే లక్ష్యం తో ఇలాంటి జాబ్ మేళాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎందరికో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందే అవకాశం కలుగుతుందనీ చెప్పారు. ఈ జాబ్ మేళా కు వచ్చినవారు ఎలాంటి బెరుకు లేకుండా, భయం లేకుండా పాల్గోవాలనీ కోరారు.

అవంతి విద్యా సంస్థలు చదువుతో పాటు వారు ఉన్నత శిఖరాలు ఎదిగేందుకు తోడ్పడుతుందనీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో 25 కంపెనీలు పాల్గొన్నాయనీ, పదవతరగతి నుంచి పి.జి వరకు, ఐటిఐ, బిటెక్,ఫార్మసీ చదువుతున్న వారికి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు. నిజంగా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ జాబ్ మేళా లో సుమారు 1000 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

# అర్హులందరికి సంక్షేమ పథకాలు

**నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్**



మాకవరపాలెం, విజయభాను న్యూస్ : కులాలు, రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలు అంద జేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షం పడుతున్నప్పటికీ దాన్ని లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికి పార్టీలు, రాజకీయాలు, కులాలు చూడ కుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎంజగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం ఎంపిపి రుత్తల సత్యనారాయణ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వాసు, వైసిపి నాయకుల, అధికారులు పాల్గొన్నారు.

## ఆదివాసి ప్రాంతంలో ఆదివాసేతరుల కు (గిరిజనేతరులకు) ఇళ్ళు స్థలాలు ఇవ్వాలని సిఎంఓ ఆఫీస్ మెమో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

**టిఎసి ఆమోదం లేకుండా సిఎంఓ ఆఫీస్ జారీ చేసిన మెమోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి..**



అల్లూరిజిల్లా, విజయభాను.పాడేరు. ఆదివాసి ప్రాంతంలో ఆదివాసేతరులకు (గిరిజనేతరులకు)ఇళ్ళు స్థలాలు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధి కారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్రెడ్డి కార్యాలయం నుండి జారీచేసిన మెమోపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని,ఆమోదం లేకుండా సిఎంఓ ఆఫీస్ జారీచేసిన మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పోటిక సత్యనారాయణ, గిరిజన సమాఖ్య సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు జుంబు దేవరాజు, కంబిడి సింహాచలం, కొయ్యల దేవుడు మాట్లాడుతూ ఆదివాసుల మనోభావాలు భారత రాజ్యాంగం కల్పించినటువంటి చట్టాలు హక్కులు ఉల్లంఘించి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి ప్రాంతంలో నివశిస్తున్న ఆదివాసేతరులకు (గిరిజ నేతరులకు )ఇళ్ళు స్థలాలు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశిస్తూ రాష్ట్రముఖ్యమంత్రి కార్యాయం అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు జారీచేసిన నోట్ నెం : 123/ అడిషనల్ సెక్రటరీ (ఎంఆర్) 2022, తేది. 14-6-2022న ఉత్తర్వులు జారీ చేయడం విధితమే. అదేవిధంగా నవరత్నాల్లో భాగంగా జగనన్న శాశ్వత గృహ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. ఆదివాసి ప్రాంతంలో గిరిజనేతరులకు జగనన్న గృహ శాశ్వత పథకం సమర్ధవంతంగా అమలుచేయడానికి ఆదివాసేతరులకు (గిరిజనేతరులకు) కూడా సెంటున్నర స్థలాన్ని ఇళ్ళు స్థలం కేటాయించి, నివాసధృవపత్రం (ఎల్పిసి) జారీచేయాలనిఎమ్మెల్యేలు కోరినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

1/70 చట్టాన్ని ఉల్లంఘనకు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి చర్యలు తీసుకోవడం చాలా దుర్మార్గమని, ఆదివాసి ప్రాంతంలో గిరిజన సలహా మండలి ఆమోదం లేకుండా గిరిజనేతరులకు ఇళ్ళు స్థలం కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం జారీచేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనది. సిఎంఓ కార్యాలయం జారీచేసిన మెమోను ఆదివాసి ఎమ్మెల్యేలు, ఎంపి వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరుతున్నాం. ఆదివాసి ప్రాంతాల్లో గిరిజనులకు ఇళ్ళ స్థలాలు కేటాయించి, ఎల్పిసి మరియు పోడు పట్టాలను మంజూరు చేయాలని, గిరిజన హక్కులు, చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశు ద్ధి వుంటే సిఎంఓ ఆఫీస్ జారీచేసిన మెమోను వెంటనే ఉపసంహరించుకోవాలి.

అక్రమ కట్టడాలు కడుతున్న ఆదివాసేతరులకు తక్షణమే ఎన్టీఆర్ కేసులు నమోదు చేయాలి. ఆదివాసి ప్రాంతంలో విచ్చలవిడిగా అక్రమంగా నిర్మిస్తున్న రిసార్ట్స్, లాడ్జిలు, హొటల్స్, షాపింగ్ కాంప్లెక్స్లు నిర్మాణాలు నివారించడానికి, ఐటీడీఏ చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సీఎంఓ కార్యాలయం జారీ చేసిన మెమ్మెను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# 12 ఎకరాల్లో నీటిపై తేలియాడే సోలార్ పవర్ ప్లాంట్

## - దేశంలోనే అతి పెద్ద ఫ్లోటింగ్ (తేలియాడే) సౌరప్లాంట్ గా గుర్తింపు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రకృతి అందాలకు, టూరిస్ట్ స్పాట్ లకు నెలవైన విశాఖ నగరం ఇప్పుడు మరో మరో ప్రత్యేకతను సంతరించుకుంది. దేశంలోనే అతి పెద్ద ఫ్లోటింగ్ (తేలియాడే) సౌర ప్లాంట్‌ను నిర్మించి మరో రికార్డు సృష్టించింది. పర్యావరణానికి హాని చేయకుండా... రిజర్వాయర్‌లోని నీటిని కూడా ఆవిరి కానివ్వని ఈ ప్రాజెక్టులో ఎన్నో విశిష్టతలున్నాయి. నగర వాసులకు తాగునీటిని అందిస్తున్న మేఘాద్రిగడ్డను సోలార్ పవర్ ప్లాంట్ గా మార్చేసి అద్భుతమైన రీతిలో మలిచి జీవీఎంసీ గుర్తింపు పొందింది. రిజర్వాయర్ నీటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ఓవైపు నీటిని ఆవిరికాకుండా అడ్డుకోవడం, రెండోవైపు సోలార్ పవర్ ఉత్పత్తి ద్వారా అవసరాలు తీర్చడం వంటివి ఏకకాలంలో జరగడం విశేషం. ఇక తాజాగా దీనికి సంబంధించిన ఓ వీడియోను జీవీఎంసీ షేర్ చేసింది. ఈ డ్రోన్ విజువల్స్ లో సౌర విద్యుత్ ను అందించే విద్యుత్ ప్యానెళ్లు నీటిపై తేలియాడడాన్ని గమనించవచ్చు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ పవర్ ప్లాంట్ నిర్మించామని, ఇది ప్రతి సంవత్సరం 4.2 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదని జీవీఎంసీ కమిషనర్ జి.లక్ష్మీశ తెలిపారు. అదనంగా, మేము సంవత్సరానికి 54,000 టన్నుల బొగ్గును ఆదా చేస్తున్నామన్న ఆయన.. సంవత్సరానికి 3,022 టన్నుల ఉద్గారాలను తగ్గిస్తున్నామని స్పష్టం చేశారు.

అయితే విశాఖపట్నం నగర జనాభా సుమారు 22 లక్షలు. వీరి విద్యుత్ అవసరాలతోపాటు నగర పరిధిలో వివిధ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, వీధి దీపాలకు రోజూ 40 మెగావాట్ల విద్యుత్ అవసరం. ఇదంతా ఈపీడీసీఎల్ (ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ లిమిటెడ్) నుంచి కొనుగోలు చేయాలి. ఇది జీవీఎంసీకి ఆర్థిక భారమే అవుతోంది. ఈ భారాన్ని కొంతైనా తగ్గించుకునేందుకు సహజ ఇంధన వనరైన సౌర విద్యుత్‌ను తయారు చేసుకోవాలని ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.

**...విశిష్టతలు. దేశంలోనే అతి పెద్ద తొలి ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేసిన జీవీఎంసీ....**

ముడసర్లోవలో రిజర్వాయర్‌లో రూ.11.37 కోట్లతో 2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టును నిర్మించింది. రూ.14.04 కోట్లతో మొత్తం 3 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించబడింది. 2019 డిసెంబర్ లో పనులు ప్రారంభించగా.. ఈ ఏడాది మార్చిలో పూర్తి చేశారు. తడిచినా తుప్పుపట్టని, జర్మన్ టెక్నాలజీ కలిగిన అత్యాధునిక ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రెండు మీటర్ల పొడవు, ఒక మీటర్ వెడల్పు కలిగిన 9,020 ఫోమ్ టెక్నాలజీతో కూడిన ఎల్లో ట్రూపర్స్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు.

ఇదిలా ఉండగా గుర్‌గావ్‌కు చెందిన రెన్యూ సోలార్ సిస్టమ్ ప్రై. లిమిటెడ్ సంస్థ ఈ ప్రాజెక్టు పనులు చేపట్టింది. విశాఖపట్నం చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(వీసీఐసీడీపీ)లో భాగంగా ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కి సంబంధించి అర్బన్ క్లైమేట్ చేంజ్ రెసిలియన్స్ ట్రస్ట్ ఫండ్(యూసీసీఆర్టీఎఫ్) నిధులతో ప్రాజెక్టు పూర్తి చేసింది.

**12 ఎకరాల్లో... 40 శాతం నీరు ఆదా...**

సాధారణంగా 3 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్ట్ ను నిర్మించేందుకు 12 ఎకరాల విస్తీర్ణం అవసరమవుతుంది. కానీ మేఘాద్రి రిజర్వాయర్‌లో నీటి ఉపరితలంపై ప్రాజెక్టు ఏర్పాటు చేయడంతో 12 ఎకరాలు ఆదా చేయగలిగారు. రిజర్వాయర్‌లోని 0.1 శాతం విస్తీర్ణంలో అంటే 0.005 చ.కి.మీ విస్తీర్ణంలోనే ఈ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్స్ నీటి ఉపరితలంపై ఉండటంతో రిజర్వాయర్‌లోని నీరు ఆవిరి కాకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా 40 శాతం వరకూ నీటిని కూడా ఆదా చేస్తుంది.

# అందుబాటులో యూనియన్ బ్యాంక్ ఏటీఎం

భీమునిపట్నం (విజయభాను న్యూస్): భీమిలీ యూనియన్ బ్యాంక్ ఏటీఎం చాలా కాలంగా అందుబాటులో లేక బ్యాంక్ ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఎట్టకేలకు దీనికి మోక్షం కలిగి పాత ఎ.టి.ఎం. తొలగించి కొత్త ఏటీఎం ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విషయం పై బ్రాంచ్ మేనేజర్ వై.వి నాయుడు మాట్లాడుతూ ఈ ఏటీఎం ద్వారా డబ్బులు విత్ డ్రా చేసుకోవడంతో పాటూ డిపాజిట్లు కూడా చేసుకోవచ్చు అని తెలిపారు.

అంతేకాకుండా ఈ మెషిన్ ద్వారా ఈకేవైసి కూడా చేసుకోవచ్చని అన్నారు.

# నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

భీమునిపట్నం(విజయభాను న్యూస్) : భీమిలి మత్స్యకార నాయకులు ఆధ్వర్యంలో నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు మత్స్యకార నాయకులు భీమిలి హిందూ ధర్మ పరిరక్షణసమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖ రావు తెలిపారు. శనివారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 1గంట వరకు భీమిలి ఎగువపేట గ్రామాభి ,వృద్ధి సేవాసంఘం వేదికపై నిర్వహి స్తామనీ అన్నారు.

వివరాలకై 93981 90142 సంప్రదించాలనీ చెప్పారు.

# గంజాయి పట్టివేత వాహనాలు సీజ్, నిందుతుడు అరెస్ట్



అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి పోలీస్ స్టేషన్ యస్ ఐ , కె,రాము, గారికి రాబడిన గంజాయి అక్రమ రవాణా గురించి నమ్మదగిన సమాచారం వచ్చినందున, సిబ్బందితో కలిసి అనంతగిరి, జీ, జే,కాలేజీ దగ్గర మెయిన్ రోడ్డు వద్ద వాహన తనిఖీ చేయుచుండగా, ఉదయం సుమారు 09:00 గంటల సమయంలో అరకు వైపు నుండి ఎస్.కోట వైపుకు వచ్చుచున్న ఎంహెచ్ 04 కెఎఫ్ 2773 బొలెరో టెంపో పికప్, ఏపి 24 పి 666 నెంబర్ గల వాహనములు వస్తుఉండగా, సదరు వాహనములు ఆపి తనిఖీచేయగా మహారాష్ట్రకు చెందిన, సరన్ శివయోగి జునాగి, సోహెల్ సలీమ్ షేక్, మరియు ఒడిషా కోరాపుట్ కు చెందిన సంజయ్ లు కలిసి 280 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా, పట్టు కున్నట్లు, కోరాపుట్ కు చెందిన సంజయ్ తప్పించుకొని పారిపోయినట్లు, మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తలను పట్టుకొని అరెస్ట్ చేసి సెంట్రల్ జైల్ కి పంపడమైనది.

# కేంద్ర రైల్వే మంత్రితో ఎంపీ జీవీఎల్ భేటీ

**- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమై విశాఖపట్నం కేంద్రంగా కొత్త సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరిన ఎంపీ జీవీఎల్ నరసింహారావు**

**- సౌత్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయాన్ని తక్షణమే నిర్మించేందుకు భూమి మరియు నిధుల లభ్యతకు రైల్వే మంత్రి హామీ**

**- విశాఖ కేంద్రంగా జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుంది**



న్యూ ఢిల్లీ (విజయభాను న్యూస్): విశాఖపట్నం ప్రజల కలల ప్రాజెక్టుగా మంజూరైన విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా కొత్త సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ(రాజ్యసభ) జీవీఎల్ నరసింహారావు పార్లమెంట్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొత్త రైల్వే జోన్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని విశాఖ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని ఎంపీ జీవీఎల్ తన లేఖలో పేర్కొన్నారు. విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే (SCoR) జోనల్ హెడ్‌క్వార్టర్స్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి, నిధులు రెండూ అందుబాటులో ఉన్నాయని రైల్వే మంత్రి ఎంపి జివిఎల్ నరసింహారావుకు హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కొత్త జోన్‌కు రూపశిల్పి అయినందున, కొత్త ఈస్ట్ కోచ్ రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు త్వరగా ఆయనద్వారా శంకుస్థాపన చేయించాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు రైల్వే మంత్రిని కోరారు.

భవిష్యత్‌లో ప్రధాని ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి పర్యటనలు చేస్తారో నిర్ధారించిన తర్వాత అభ్యర్థన చేస్తానని రైల్వే మంత్రి హామీ ఇచ్చారు. రైల్వే మంత్రితో జరిగిన సమావేశంపై ఎంపీ జీవీఎల్ నరసింహారావు సంతోషం వ్యక్తం చేస్తూ, రైల్వేజోన్‌ను త్వరగా ప్రారంభించేందుకు రైల్వే మంత్రి సిద్ధంగా ఉన్నారని, ప్రత్యేకించి విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ ప్రజల కల త్వరలో సాకారం కానుందని అన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను రూ.400 కోట్లతో ఆధునీకరించే ప్రాజెక్టు, ఐఐమ్ విశాఖపట్నం మొదటి దశ ఆధునిక క్యాంపస్, రూ.22,000 కోట్ల హెచ్పిసిఎల్ యొక్క విస్తరణ మరియు ఆధునీకరణ ప్రాజెక్ట్‌తో పాటు క్రూయిస్ టెర్మినల్, మెగా ఫిషింగ్ హార్బర్ మొదలైన అనేక ఇతర ప్రాజెక్టులను విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపనతోపాటు ప్రారంభచేసేందుకు త్వరలో విశాఖపట్నం సందర్శించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని తాను స్వయంగా కోరతానని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. విశాఖపట్నంలో కనిపించే అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల వల్లనే జరిగిందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ కృషి చేస్తుందని ఎంపీ జీవీఎల్ తెలిపారు.

# తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సీమంతాలు

## తల్లులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం : కోటవుట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎల్ సుజాత సూచనల మేరకు మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం అంగన్వాడి కేంద్రంలోని గర్భిణీ స్త్రీలకు ఘనంగా సీమంతాలను స్థానిక అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి,కమల తదితరులు ఏర్పాటు చేశారు. సెక్టార్ సూపర్వైజర్ ఐ.సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.ఎంపీటీసీ చిటికెల వరలక్ష్మి తోపాటు పంచాయతీ కార్యదర్శి హైమావతి ఇతర శాఖల సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వాలని కోరారు లబ్ధిదారులైన బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం రిపేర్లకు సంబంధించి తగు చర్యలు వెంటనే చేపట్టాలని స్థానిక వైసిపి నాయకులు చిటికల రమణకు సూచించారు.



# హిందీ విభాగంలో ధర్మాన లక్ష్మీకి వర్సిటీ డాక్టరేట్

## ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్): హిందీ విభాగం పరిశోధకురాలు ధర్మాన లక్ష్మికి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యులు స్వర్గీయ సాగి అప్పల సూర్యనారాయణ వర్మ పర్యవేక్షణలో ' జగదీష్ చంద్‌కే ఉపన్యాసోంమే చిత్రిత్ సమస్యాయే' అంశంపై జరిపిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ధర్మాన లక్ష్మి స్వీకరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మిని విభాగ ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# జీనబాడు లో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

## ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిని కోరిన ఎంపీపీ శెట్టి నీలవేణి



అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి మండలంలోని జీనబాడులో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ను అనంతగిరి లిఎంపీపీ శ్రీమతి శెట్టి నీలవేణి కోరారు.పాడేరు లో ఆయన్ని కలిసి మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. పినకోట, పెదకోట,జీనబాడు,కివర్ల పంచాయతీ లలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, అనకాపల్లి జిల్లా దేవరపల్లి సబ్ స్టేషన్ నుంచి సరఫరా అవుతుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని జీనబాడులో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

పినకోట పిహెచ్‌సి, కె.కోటపాడు క్లస్టర్ నుంచి అరకు లోయ క్లస్టర్ లోకి మార్చాలని ఆమె కోరారు.

వసతి గృహాలలో వర్కర్ల సమస్యపై ఆమె po తో మాట్లాడి సమస్య పరిష్కారానికి హామీ తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో కో అప్షన్ సభ్యుడు లిషేక్ మదీనా, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు పాగి అప్పారావుపాల్గొన్నారు.

# డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌పై సర్వే

### రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



న్యూఢిల్లీ : విజయవాడ గుండా వెళ్ళే రెండు డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లకు సంబంధించి సర్వే, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించే పనులు పురోగతిలో ఉన్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఖర్గపూర్ నుంచి విజయవాడ (1115 కి.మీ)కు ప్రతిపాదించిన ఈస్ట్ కోస్ట్ కారిడార్, విజయవాడ-ఇటార్సీ (975 కి.మీ) మధ్య ప్రతిపాదించిన నార్త్ సౌత్ సబ్ కారిడార్‌కు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లను ప్రభుత్వం ఇంకా మంజూరు చేయలేదని అన్నారు. సర్వే, డీపీఆర్ పూర్తయిన తర్వాత సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ వంటి అంశాల ప్రాతిపదికపై మాత్రమే ఏ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌నైనా మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# మిస్ సౌత్ ఇండియాగా వైజాగ్ అమ్మాయి

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : మిస్ సౌత్ ఇండియాగా విశాఖ అమ్మాయి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం విద్యార్థిని చరిష్మా కృష్ణ ఎంపికైంది. కేరళలో పెగాసస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ పోటీల్లో ఆమె కిరీటం దక్కించుకుంది. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన యువతులు పాల్గొన్నారు. వీరందరినీ వెనక్కి నెట్టి, తన ప్రతిభతో చరిష్మా విజేతగా నిలిచింది.


ప్రముఖ మోడల్ భారతి బెర్రి ఆమెకు శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం ఆమె ఫెమీనా మిస్ ఇండియాకు సిద్ధమవుతోంది. చిన్నతనం అమెరికాలో గడిపిన చరిష్మా కృష్ణ భరతనాట్యం, కూచిపూడి నృత్యం తొమ్మిదేళ్లుగా నేర్చుకుంటోంది.

స్విమ్మింగ్, కరాటే, గుర్రపుస్వారీ విద్యలను సైతం నేర్చుకుంది. చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో నృత్య కళాకారిణిగా, నటిగా రాణిస్తోంది. తండ్రి హరికృష్ణ ప్రభుత్వ ఉద్యోగి కాగా తల్లి గృహిణి.




# ఘనంగా సిటియు వ్యవస్థాపక దినోత్సవం

### ముఖ్య అతిథిగా నన్నయ విశ్వ విద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ.మొక్కా జగన్నాధరావు



విజయనగరం (విజయభాను న్యూస్): కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మూడవ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భాగంగా ముందుగా సిటియు వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి మరియు రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ మొక్క జగన్నాధ రావు కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు.

అనంతరం ప్రొఫెసర్ కట్టిమణి ప్రారంభోపన్యాసం లో భాగంగా మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటికి మూడు వసంతాలు పూర్తి చేసుకుందని ఈ విశ్వ విద్యాలయం గిరిజనుల స్తితిగతులను మెరగుపరచడానికి మరియు గిరిజనులు పాటించే మంచి ఆచార వ్యవహారాలను సమాజానికి బహిర్గతం చేసి సార్వజనీనం చేయాడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ గిరిజన విశ్వ విద్యాలయం ఉత్తరంధ్ర విద్యార్దుల పాలిత కల్పతరువని వారి విద్యాపరమైన ఆశలను కలలను నిజం చేయ్యడానికి ప్రభుత్వం చే స్తాపించబడినదని ఇది ఈ ప్రాంతంలో గల విద్యార్దినీ విద్యార్దులకు రాబోయే తరాలకి విద్యనభ్యసించడానికి ఒక మంచి వేదికగా ఉండబోతోందని తెలిపారు.

అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ మొక్కా జగన్నాధ రావు పాల్గొని విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణికి, విద్యార్థులకు మరియు సిబ్బందికి యూనివర్సిటీ మూడవ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లో గిరిజన విశ్వవిద్యాలయ స్థాపన ద్వారా గిరిజనులకే కాక వెనుకబడిన తరగతులు బడుగు బలహీనవర్గాల ప్రజలకు, ఉన్నత వర్గాలలో కడు పేద స్థితిలో ఉండి చదువుకోలేని అగ్రవర్ణ పేదలకు ఏంతో మంచి జరిగిందని ఈ విశ్వవిద్యాలయం విద్యార్థుల భ్యవిష్యత్తు కి పునాదులు వెయ్యడమే కాకుండా ఈ ప్రాంత అభివృద్ధికి ఏంతో దోహదం చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులనియూ అలరించారు.

# మర్యాదపూర్వకంగా జివిఎంసి కమిషనర్ ను కలసిన రాష్ట్ర ఎస్ టి కమిషన్ ఛైర్మన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశను రాష్ట్ర ఎస్.టి. కమిషనర్ ఛైర్మన్ కుంబా రవిబాబు మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్ లో కలిసారు. ఈ సందర్భంగా వారిరువురూ నగరంలో జరుగుతున్నా పనులు, ఉద్యోగుల పదోన్నతిలోని రిజర్వేషన్ తదితర అంశాలపై చర్చించారు.

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై స్పందన బాగుందని, అందుకు కమిషనర్ కృషి అభినందనీయమైనదని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కమిషనర్ మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ విశాఖ ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ విడనాడి గుడ్డ సంచులను ఉపయోగిస్తున్నారని, ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని ఛైర్మన్ కు వివరించారు.

# అంతరాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల ముఠా అరెస్ట్

- అంతా ఒరిస్సా రాష్టానికి చెందిన వారే
- పెదబయలు పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్







పాడేరు(విజయభాను న్యూస్): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో ఇటీవలి కాలంలో జరుగుతున్న వరుస ద్విచక్ర వాహన దొంగతనాలకు అడ్డుకట్టగా పెదబయలు పోలీస్ ఎస్సై మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి నలుగురు ఒరిస్సా రాష్టానికి చెందిన అంతరాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలను పట్టుకొని వారి వద్ద 18 మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు. అందులో 10 రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిళ్లు, 04-బజాజ్ పల్సర్ బైక్ లు, 01-సుజుకి జిక్సర్ బైక్, 01-హొండా సిబిఆర్ బైక్, 01- హీరో ఎక్ట్రీమ్ బైక్,01- హీరో గ్లామర్ బైక్, మొత్తం బైక్ లను రికవరీ చేయడమైనది మరియు ఆ నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టుకు పంపించడమైనది. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద నుండి భారీ వాహనాలు రికవరీ చేయడం అభినందనీయమన్నారు. పెదబయలు పోలీసులను ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలి

- జడ్పీ సీఈవో విజయ్ కుమార్
- ఆహుతులను ఆకట్టుకున్న దేశభక్తి గీతాలు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని జడ్పీ సీఈవో విజయ్ కుమార్ పేర్కొన్నారు. 75 సంవత్సరాల ఆజాదికా అమృత్ మహోత్సవ్ , హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 1 నుండి 15 వరకు కార్యక్రమాల ను నిర్వహించు కుంటున్నాయన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విద్యార్థులుచే దేశభక్తి పై సాంస్కృతిక కార్యక్రమాలు, మోనో యాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది దేశ నాయకుల త్యాగ ఫలితాలను అందరమూ అనుభవిస్తున్నట్లు చెప్పారు. దేశ భక్తిని అందరమూ చాటి చెప్పాలన్నారు. సాటి మనిషికి సహాయం అందించాలని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆగస్టు 1 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగ నిర్వహించుచున్నట్లు పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి. మణిరాం మాట్లాడుతూ దేశభక్తి ని అందరము చాటాలన్నారు. 1 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనాడు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నామంటే ఆనాడు దేశ నాయకులు చేసిన పోరాటాలు, త్యాగ ఫలితాలేనన్నారు. ఈ కార్యక్రమంలో కప్పరాడ హైస్కూల్ నుండి ఎందరో మహానుభావలు నృత్య ప్రదర్శన, ఏక పాత్రాభినయం నృత్య ప్రదర్శన చేశారు. రామ్ నాథ్ హైస్కూల్ నుండి జయహో జయజనని గీతం, గాయంగె హంసబ్ మిల్కె గీతాలను ఆలపించారు. జివిఎంసి మదురానగర్ హైస్కూల్ నుండి సర్వమత సమానత్వం స్కిట్, ఓ కొండ కోనల్లో ప్రదర్శించారు. శ్రీ సాయి కళానికేతన్ రాగిని కూచిపూడి నాట్యమండలి నుండి కూచిపూడి నృత్యం, జగతి సిగలో జాబిలమ్మ (ఐ లవ్ ఇండియా) నృత్యం, శివాజీపాలెం హైస్కూల్ నుండి ప్లాస్టిక్ నిషేధం పై గీతం, పింగళి వెంకయ్య దేశ భక్తి గేయం, కన్నడ గేయం ఆలాపన, జివిఎంసి హైస్కూల్ నుండి ఎగరాలి మన స్వాతంత్ర్య జెండా గీతం, జివిఎంసి హైస్కూల్ కె కాలనీ నుండి సంఘటన ఒక యజ్ఞం ప్రదరనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సర్వ శిక్షా అభియాన్ పిఓ శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు, హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







# కేంద్రంపై కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు..

### పోలీసుల అదుపులో రాహుల్

దిల్లీ: పెట్రోల్, నిత్యావసరాలు, జీఎస్టీ పెంపు, అగ్నిపథ్ వంటి అంశాలపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతోంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, సీనియర్ నేతలు ప్రధాని నివాసాన్ని ముట్టడిస్తారని, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పార్లమెంట్ నివాసం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు ఇప్పటికే హస్తం పార్టీ ప్రకటించింది. అందుకు తగ్గట్టే ఈ రోజు నిరసనలకు దిగింది. దిల్లీలో పార్టీ కేంద్రకార్యాలయం సహా పలు రాష్ట్రాల్లో ఈ ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ సహా అంతా నలుపుదుస్తులు ధరించి, నిరసన చేపడుతున్నారు. వారంతా పార్లమెంట్‌కు నలుపు దుస్తుల్లోనే హాజరయ్యారు. విపక్షాల గందరగోళంతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. వాయిదాల పర్వం కొనసాగింది.

కాంగ్రెస్ ర్యాలీ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడకుండా దిల్లీ యంత్రాంగం నిషేధాజ్ఞలు విధించింది. దేశ రాజధానిలో కాంగ్రెస్ నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లే దారిలో పారామిలిటరీ బలగాలు, దిల్లీ పోలీసుల్ని మోహరించారు. బారికేడ్లు పెట్టి నిరసనకారులను అడ్డుకున్నారు. పార్లమెంట్ వద్ద ఆందోళనలకు సోనియా గాంధీ నేతృత్వం వహిస్తున్నారు. అలాగే అక్కడ ధర్నాకు కూర్చున్న రాహుల్ గాంధీ, అధిర్ రంజన్ చౌధరీ, కేసీ వేణుగోపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com